6 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 30 మార్చి 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com



## లాస్ట్ సెమిస్టర్

చిన్నప్పుడు
ఎంతమంది పిల్లలని
ఎవరైనా అడిగితే
ఇద్దరూ అమ్మాయిలేనని!
వారి మాటల్లో చిన్న వెలితి

వారిలో ఒక బాధ్యత గల పెంపకం
నాలో ఒక భయం లాంటి చీకటి పొర
వాళ్ల నవ్వుల పంటగా పెంచారు
నేను ఆశల అంకురమై పెరిగాను

సెలవులకు ప్రతిసారి
మా ఊరికి వచ్చినప్పుడల్లా
వారిలో కొంచెం మార్పు కనిపిస్తుంది
భౌతికంగా సరే సరే
మానసికంగా కూడా!
నేను కూడా పరిణతి చెందుతున్నట్టు
మారుతున్నట్టు వికసిస్తున్నాను

మొదట్లో నలుగురితో
కలిసి వెళ్లేదాన్ని
ఇప్పుడు నేనుగానే ప్రయాణం
తొలిసారి
వారి గుండెల్లో వచ్చిన చెమ్మ
ఆందోళన భయం ఇప్పుడు లేవు

కాలానుగుణంగా...
నేను నేర్చుకున్న
అనుభవాలు, ఆలోచనలు
వాళ్లకు అభయహస్తాన్ని
ఇస్తున్నట్టున్నాయి

నేను వెళ్లిరావడం
నాకంటే వాళ్లకే తేలికైనట్టుంది
మొదటిసారి
నేనే భయంగా టాటా చెప్పేదాన్ని
ఇప్పుడు
వాళ్లే ధైర్యంగా టాటా చెప్తున్నారు

ఒడిదుడుకుల ప్రయాణంలో...
చూస్తుండగానే చదువు పూర్తయింది
ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ...
ఉద్యోగ లక్ష్యం ఛేదించాను

అప్పుడు
వాళ్ల డబ్బులు సమకూర్చి
బాధ్యత నెరవేర్చుకున్నారు
ఇప్పుడు నేను
వారికి డబ్బులు పంపిస్తూ
గర్వపడుతున్నా

వాళ్ల కాలమాన పరిస్థితులను
తట్టుకొని పెరిగిన అనుభవాల చెట్లు
నేను పెరిగి పెద్దగై
వెలుగులు పంచే మమతల దివ్వెల
చెట్టును

వాళ్లు ఇప్పుడు
చిన్నపిల్లల మనస్తత్వం గల పెద్దవారు
నేనిప్పుడు
వారి బరువు బాధ్యతలు చూడాల్సిన
కంటిపాపను
వాళ్లు పడమటికి ఒరుగుతున్న
సూర్యులు
నేను తూర్పున ఎదిగివస్తున్న
ఇనబింబాన్ని

ఇంకొన్ని రోజుల తర్వాత
కాలం లాగి నెట్టేస్తే
వాళ్లలాగే వారి పాత్రలోకి
నేను పరకాయ ప్రవేశం చేయాల్నేమో!




జందం అశోక్

## అందుకే ఫోన్ లాక్కున్నారు!

కేంద్రంలోని బీజేపీ సర్కార్ దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నది. కమలం పార్టీ చేతిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రాజకీయ అస్త్రంగా మారిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆప్ అనుసరించనున్న వ్యూహాన్ని తెలుసుకోవాలని ఈడీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అందుకే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఫోన్ లాక్కున్నది.

**- ఆతిశీ,** ఢిల్లీ విద్యాశాఖ మంత్రి




# కాంగ్రెస్.. కరువు.. కన్నెర్ర!

'పంటలకు నీళ్లు లెవ్వు.. కరెంట్‌కు కటకటనే.. పెట్టుబడి సాయానికి పాతర పెట్టింది.. రుణమాఫీ ఊసే లేదు.. ఆరు గ్యారెంటీల సంగతేమో కానీ, ఉన్నవాటిని ఊడగొట్టి.. పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నది..' అని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్నది రాష్ట్ర రైతాంగం. ఆ పార్టీ నాయకుల తీరుపై రైతన్న కన్నెర్ర జేస్తున్నడు. కానీ, ఆ రైతన్న మీద కాంగ్రెస్ పార్టీకి కొంతైనా కనికరం లేకుండాపోయింది.



చిటుకుల మైసారెడ్డి
94905 24724

అబద్ధాలు, గోబెల్స్ ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు హాయిగా ఉన్నారు. పాపం రైతులేమో ఎండిన పంటలు చూసి తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరం. గత మూడు, నాలుగు నెలలుగా తమాషా చూస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఎండిపోతున్న పంటల వైపు కనీసం కన్నెత్తి చూడలేని కబోధిలా వ్యవహరిస్తున్నది. ఢిల్లీ రాయబారాలు, విమానాల్లో చక్కర్లు, పదవుల పందేరాలు, ఎన్నికల హంగామాలతో కాంగ్రెస్ నాయకులు సందడి చేస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు, కరెంటు, పెట్టుబడి సాయం.. సరైన సమయంలో రైతులకు అందించింది. తత్ఫలితంగా బీఆర్ఎస్ పదేండ్ల పాలనా కాలంలో రైతులు దర్జాగా బతికారు. ఇది ఓర్చుకోలేని కాంగ్రెస్ పార్టీ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ నాయకత్వంపై అసత్య ప్రచారాలు, నిరాధారమైన ఆరోపణలు చేసి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ. ఆ పార్టీ చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? డిసెంబర్ 9న రైతుల రుణమాఫీ, రైతుభరోసా పథకాలు అమలుచేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు కనీసం రైతుల గోడు పట్టించుకోకుండా మొఖం చాటేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లోని రైతుల వద్దకు వెళ్లడం లేదు. ఎండిపోతున్న పంటలను కూడా కనీసం పరిశీలించడం లేదు.

గత పదేండ్లు రైతుల పక్షాన అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ప్రతిపక్షంలోనూ రైతులకు అండగా ఉంటున్నది. ఎండిన పంటలను పరిశీలిస్తూ రైతులకు భరోసా ఇస్తున్నది. 'కేసీఆర్ ప్రభుత్వంలోనే వ్యవసాయం బాగుపడ్డది. రైతులు మంచిగ బతికిండ్రు. నీళ్లకు, కరెంటుకు, రైతుబంధుకు ఇబ్బంది లేకుండె. తెలంగాణ రైతాంగం పరిస్థితులు ఇప్పుడు అల్లకల్లోలమైనయి' అని గుండె నిండా బాధతో రైతు రంధి పడుతున్నడు. అప్పోసప్పో జేసి పంటలు వేస్తే నీళ్లందక అవి ఎండిపోతున్నాయి.



> అన్నదాత బతుకు ఆగమయ్యే రోజులు మళ్లీ వచ్చాయని రోదిస్తున్నాడు. కరువు వచ్చింది. కరువంటే మామూలు కరువు కాదు, కనీసం తాగడానికి కూడా గుక్కెడు నీళ్లు లేని కరువు వచ్చింది. జుక్కల్ ప్రాంతంలో ఐదు రోజుల నుంచి మంచినీళ్లు లేకపోవడంతో మహిళలు అరిగోస పడుతున్నారు. ఇదే పరిస్థితి దాదాపు రాష్ట్రమంతా ఉన్నది. మార్చి చివరలోనే ఇట్లా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎలాంటి పరిస్థితులు ఉండబోతున్నాయో ఊహించుకుంటేనే భయం వేస్తున్నది.

పార్లమెంట్ ఎన్నికల్లో రైతుల నుంచి ప్రతిఘటన ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రహించింది. అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ మధ్య తాము డీలా పడిపోయమా అనే నిర్వేదంతో కాంగ్రెస్ ముఖ్యమంత్రి, మంత్రులు ఉన్నట్టు అర్థమవుతున్నది. కొత్త ఎత్తుగడలతో, ప్రజలను ఎలా మాయ చేయాలో, మభ్యపెట్టాల్నో అని ఆలోచిస్తున్నారు. ఎటొచ్చీ పార్లమెంట్ ఎన్నికల్లో గట్టెక్కడమే కాంగ్రెస్ వ్యూహం. లేకుంటే హైకమాండ్ దగ్గర ఉన్న పలుకుబడి పోయి అసలుకే ఎసరు వస్తుందేమోనని కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ప్రకంపనలు మొదలయ్యాయి.

వారి అంచనాలకు తగ్గట్టుగానే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం రోజురోజుకు మారుతున్నది. ప్రజల్లో కేసీఆర్ పట్ల ఆదరణ పెరుగుతున్నది. రాష్ట్ర ప్రజానీకం మంచి ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామనే బాధలో, పునరాలోచనలో ఉన్నది. నీళ్లిచ్చే పరిస్థితి ఉన్నా, కాళేశ్వరంపై కుట్ర చేసి ప్రాజెక్ట్‌ను ఎండబెడుతున్నది. వ్యవసాయానికి నీళ్లు అందించకుండా చేతులెత్తేసి రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నది. ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో నేడు తెలంగాణ ఎడారిని తలపిస్తున్నది. కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారు. ఆరు గ్యారెంటీల భ్రమలో పడి.. ఉన్న ఎవుసాన్ని ఎడారి చేసుకున్నామని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి రాగానే సాగు, తాగునీటికి, విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందు జాగ్రత తీసుకుంటుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వాటి జోలికే పోవడం లేదు. తొమ్మిదిన్నరేండ్ల పాటు కరెంటు కష్టాలుండేనా? లేవు. నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్తునందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కింది. సాగు, తాగునీటికి ఎన్నడూ ఇబ్బందులు తలెత్తకుండా ఆయన చర్యలు తీసుకున్నరు. ఏటా రెండు పంటలకు నీళ్లిచ్చిన ఘనత కేసీఆర్‌ది. కానీ, నేడు రాష్ట్రంలో రైతు బతుకు ఆగమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పంటలు ఎండిపోయి పొలాలు బీళ్లుగా మారాయి. అన్నదాతల్లో కన్నీళ్లు ఉబికి వస్తున్నాయి. గత తొమ్మిదేండ్లుగా కరువన్నది ఎరగని రైతన్న ఈ మూడు, నాలుగు నెలల్లోనే కరువుతోనే కాలం ఎల్లదీస్తున్నాడు. కరువుకాలం అంటే ఇదేనేమో!

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

### లేఖ

## శ్వేతపత్రాల పేరిట యాగి

**రాష్ట్రంలో** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడవుగా శ్వేతపత్రాల విడుదల పేరిట నానా యాగి చేస్తున్నది. రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలించాలని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే.. అది మరిచిన కాంగ్రెస్ సర్కార్ గత ప్రభుత్వం చేసిన అప్పులను బూచీగా చూపిస్తూ పాలనను అటకెక్కిస్తున్నది. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడినాక కూడా పరిస్థితి ఇదేమాదిరిగా ఉన్నది. కానీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పులను సాకుగా చూపెట్టి పాలనను పట్టించుకోకుండా ఉండలేదు కదా? అలా చేసి ఉంటే ఆయనను విజన్ ఉన్న నాయకుడని ఎందుకంటారు? కానీ, రేవంత్‌రెడ్డి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ అవలంబిస్తున్న తీరు చూస్తుంటే తమకు పాలించడం చేతకాదని చేతులెత్తేసే విధంగా కనిపిస్తున్నది.

ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామంటూ ప్రజలను తప్పుదోవ పట్టించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఆ గ్యారెంటీల ఊసే ఎత్తడం లేదు. 'రైతు భరోసా' కింద ఎకరానికి పసలుకు రూ.7,500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతుబంధు'ను మొత్తానికే అటకెక్కించింది. పంట కాపుకొచ్చినా ఇంకా రైతుల ఖాతాల్లో 'రైతు బంధు' పైసలు జమకాలేదు. ఇదిలా ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట వరుసకు కూడా 'రుణమాఫీ' గురించి మాట్లాడటం లేదు. 'డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాను, మీరు వెళ్లి బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకోండి' అని గొప్పలకు పోయిన ముఖ్యమంత్రి రుణమాఫీ విధివిధానాలను రూపొందిస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారు.

రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం కొలువుదీరి సుమారు నాలుగు నెలలు కావస్తున్నది. కానీ, రాష్ట్రంలో వారు చెప్పినట్టు అద్భుతమైన మార్పేమీ జరుగలేదు. 'మార్పు, మార్పు' అంటే ఏదో జరుగబోతుందని ఊహించి ఓటు వేశామని ప్రజలు ఇప్పుడు నెత్తినోరు కొట్టుకుంటున్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం గెలుపు మత్తులోంచి బయటకు రావాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు పరిష్కరించాలి. లేకుంటే ప్రజలే వారికి సరైన రీతిలో బుద్ధి చెప్తారు.

**- కత్తుల వెంకటేష్**

# కుట్రలో భాగమే ఈ అరెస్టులు

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ అరెస్టు రాజకీయ కుట్రలో భాగమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఉండటమే అందుకు ప్రధాన కారణమనేది జగమెరిగిన సత్యం. కేంద్రపాలిత ప్రాంతమైనప్పటికీ ఢిల్లీలోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే పాలన కొనసాగిస్తున్నది. ఇప్పటివరకు వంతులవారీగా కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తూ వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు.. ఢిల్లీలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, దేశ రాజధానిపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని ప్రయత్నిస్తుంటాయి. 2013కు ముందువరకు ఆ పార్టీలు అనుకున్నట్టే జరిగింది. కానీ, ఆప్ రాకతో పరిస్థితి మారిపోయింది. ఆ పార్టీ మూలంగా దేశ రాజధానిలో రెండు జాతీయ పార్టీల ప్రభావం తగ్గుతూ వచ్చింది.



కన్నోజు శ్రీహర్ష
89851 30032

విజ్ఞులైన ఢిల్లీ ఓటర్లు ఆదరించడంతో వరుసగా గెలుస్తూ వచ్చిన ఆప్.. అనతికాలంలోనే పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, గోవా, గుజరాత్ తదితర రాష్ట్రాలకు విస్తరించింది. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఆప్ ఎదుగుతూ వస్తున్నది.

2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా మందీమార్బలాన్ని ఆ పార్టీ రంగంలోకి దించింది. 50కు పైగా స్థానాల్లో గెలుస్తామని ఊదరగొట్టింది. కానీ, ఆ ఎన్నికల్లో కమలం పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆప్ ఏకంగా 62 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. ఆ తర్వాత పంజాబ్‌లోనూ ఆప్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. గోవా, గుజరాత్‌లలో ఓట్లు, సీట్లు సాధించి జాతీయ పార్టీగా అవతరించింది.

ఆప్ దినదినాభివృద్ధి చెందుతుండటం బీజేపీకి మింగుడుపడటం లేదనేది బహిరంగ రహస్యమే. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కేజ్రీవాల్ వల్ల నష్టం జరగకుండా రాజకీయంగా భారీ కుట్రలకు తెరలేపినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నడూ లేని



విధంగా ఢిల్లీ పరిపాలనకు సంబంధించిన చట్టాలను మారుస్తూ ఆర్డినెన్సు జారీచేయడం, మత ఘర్షణలను ప్రేరేపించడం, కేజ్రీవాల్‌పై హిందూ ద్రోహి అనే ముద్ర వేయడం, ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చాలని చూడటం లాంటివన్నీ అందుకు నిదర్శనాలు. ఈ కుట్రలకు 2020 ఎన్నికల తర్వాత తెరలేచింది. అందులో భాగంగానే కరోనా సమయంలో ఆప్ నేతలపై దర్యాప్తు సంస్థల దాడులు మొదలయ్యాయి. నయానో, భయానో ఆప్ శాసనసభ్యులను తమవైపు లాక్కోవాలని బీజేపీ ప్రయత్నించింది. తమకు 40 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని స్వయానా కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించడాన్ని బట్టి ఆ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ సైతం ఈ విషయాన్ని పలు సందర్భాల్లో ప్రస్తావించారు.

> గత కొన్నేండ్లుగా దర్యాప్తు సంస్థలు ఆప్ నేతలపై దాడులను తీవ్రతరం చేశాయి. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలు జైలులో ఉన్నారు. ఎన్నికల్లో కేజ్రీవాల్ ప్రచారం చేయకూడదనే ఉద్దేశంతోనే ఇదే అదనుగా భావించి ఆయనను అదుపులోకి తీసుకున్నారనేది అందరికీ తెలిసిందే.

ఢిల్లీలో భూమి, శాంతిభద్రతలు మినహాయించి మిగిలిన పాలనాపరమైన విధులన్నీ అక్కడి ప్రజాప్రభుత్వమే చూసుకుంటుంది. 2023లో ఈ అధికారాలను చేజిక్కించుకోవాలనే దురుద్దేశంతో కేంద్రం ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు తీసుకొచ్చింది. లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎక్కువ అధికారాలను కట్టబెడుతూ.. ఢిల్లీ ప్రభుత్వమంటే ఎల్జీ అన్నట్టుగా ఆర్డినెన్సును రూపొందించింది. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఈ ఆర్డినెన్స్‌ను పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆప్‌ను దెబ్బకొట్టాలనే ఉద్దేశంతో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ.. ఇటీవల రిటర్నింగ్ అధికారిని అడ్డం పెట్టుకొని ఛండీగఢ్ మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకున్నది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించి, ఆప్ అభ్యర్థినే విజేతగా ప్రకటించింది.

రాజకీయ కుట్రలో భాగంగానే సరైన ఆధారాలు లేనప్పటికీ దర్యాప్తు సంస్థలను విపక్షాలపైకి కేంద్రం ఉసిగొల్పుతున్నది. విపక్ష పార్టీల బ్యాంకు ఖాతాలను సీజ్ చేయడం, ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడమే అందుకు నిదర్శనం. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన ఇటువంటి చర్యలను బీజేపీ మానుకోవాలి. లేకపోతే భవిష్యత్తులో కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆందోళనలు తలెత్తడం ఖాయం. రాష్ట్ర హోదా కోసం ఇప్పటికే లద్ధాఖ్‌లో నిరసనలు జరుగుతున్నాయి. కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ ప్రజా ప్రభుత్వాల ఏర్పాటు దిశగా కేంద్రం చర్యలు ఉండాలే తప్ప ఇలా పెత్తనం చెలాయించాలని చూడటం సరికాదు.

## ఎటమటం



### గ్యారెంటీ నహీ

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల సంగతి ఎలా ఉన్నా, ఆ పార్టీ టిక్కెట్లకు మాత్రం గ్యారెంటీ లేకుండాపోయింది. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కూడా ఒకరిద్దరు అభ్యర్థులకు టిక్కెట్లు ప్రకటించి ఆ తర్వాత వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించినవారికి కూడా నామినేషన్ దాఖలు చేసి, బీ ఫామ్ ఇచ్చేవరకు అది ఉంటుందో, ఊడుతుందోనన్న టెన్షన్ పట్టుకున్నది. సికింద్రాబాద్ అభ్యర్థిగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. మరి ఏమైందో ఏమో కానీ దానం నాగేందర్‌కు బదులు తిరిగి బొంతు రామ్మోహన్ పేరు పరిశీలిస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి సికింద్రాబాద్ టికెట్ హామీతోనే బొంతు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కానీ, అనూహ్యంగా దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో సికింద్రాబాద్ అభ్యర్థిగా ప్రకటించింది. అయితే ప్రస్తుతం దానంకు బదులు బొంతు రామ్మోహన్‌ను అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉన్నట్టు సమాచారం.



### పాపం పైసల్ లేవంట!

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయమని ఆఫర్ వచ్చినా డబ్బు లేకనే తిరస్కరించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. పైసల మంత్రి వద్ద పైసలు లేవా? అని సోషల్ మీడియాలో మీమ్స్, సెటైర్లు వెల్లువెత్తాయి. నిజమే అయి ఉండవచ్చు. పైసలకు కటకట ఉండటం వల్లనే చెన్నైలో ఆమెనే స్వయంగా కూరగాయల మార్కెట్‌కు వెళ్లి బేరమాడి మరీ కొనుకుంటున్న దృశ్యాలను మీడియాలో చూశాం. తమిళనాడులో మహిళా నేతల పరిస్థితి అలానే ఉందేమో అన్నట్టుగా, తాజాగా మన రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై కూడా తన వద్ద డబ్బులు లేకనే గతంలో ఆరు సార్లు ఓడిపోయినట్టు వాపోయారు. కానీ, ఆమె ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించిన ఆస్తులు చూస్తే డబ్బులు లేవంటే నమ్మేటట్టు లేదు. ఇదో రకమైన సింపతి సెంటిమెంట్ ఎత్తుగడేమో.



### క్యా బాత్ హై!

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా వారి సర్కార్ ఇంకా గాడిన పడలేదు. ఈ మాట ఏ బీఆర్ఎస్సో, బీజేపీ నాయకుడో అన్నాడంటే, ప్రతిపక్షాలు కదా ఆ మాత్రం అనవా అని లైట్ తీసుకోవచ్చు. కానీ సాక్ష్యాత్తూ కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ తనకు ఎదురైన ఒక ఉదంతాన్ని మీడియాతో పంచుకొని వాపోయారు. తనకు తెలిసిన బాధితుడు ఒకరు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) సహాయం కోసం వస్తే.. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ రికమండేషన్ లెటర్‌తో దరఖాస్తు పంపించారట. అయితే అదిప్పుడు ఎక్కడుందో తెలియడం లేదు. కనీసం రశీదు కూడా ఇవ్వలేదు. దరఖాస్తుకు బాధితుడు జతపరిచిన ఒరిజినల్ బిల్లులు పోతే పరిస్థితి ఏమిటి? దీన్ని బట్టి సీఎం కార్యాలయంలో ఇప్పటికీ సీఎంఆర్ఎఫ్ ఫండ్ వ్యవస్థ ఉందో? లేదో? తెలియడం లేదని నిరంజన్ వాపోయారు.



### ఫిఫ్టీ ఫైవ్ ఇయర్స్ ఇండస్ట్రీ!

ఫిఫ్టీ ఫైవ్ ఇయర్స్ ఇండస్ట్రీ అంటూ కేశవరావు తన ఫ్లాష్‌బ్యాక్ చెప్పుకొచ్చారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, తాను చెప్పడం వల్లనే అప్పుడు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారని ఆయన కుమారుడు విప్లవ్‌కుమార్ అన్నారు. మరి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరమని ఇప్పుడు ఎవరు చెప్పారు? అని అడిగితే.. తన కుతూరు విజయలక్ష్మి అని చెప్తారేమో. మొత్తం మీద ఆయన తన ఇంట్లో కుమారుడు, కూతురిని సమానంగా చూస్తూ వారి మాటకు విలువ ఇస్తున్నట్టు ఉంది. ఇంతకు ఎవరో ఒకరు చెప్తే తప్ప కేకే సొంతంగా నిర్ణయాలు తీసుకోరా? అన్నదే అసలు పాయింట్.

**- వెల్జాల**